కందిపప్పులో కోత..!





సింగరాయకొండలోని సివిల్ సప్లయ్ గోడౌన్

- 70 శాతం కార్డుదారులకే సరఫరా
- అరకొరగా సరఫరా చేయడంతో కార్డుదారుల ఇక్కట్లు
- చేతివాటం చూయిస్తున్న గోడౌన్ సిబ్బంది

సింగరాయకొండ:

రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ నెల కందిపప్పు కోటాలో భారీ కోత విధించింది. దీంతో రేషన్ డీలర్లు, కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సరఫరాల వ్యవస్థపై సీతకన్ను వేసింది. కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుంటుంది. నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్న తరుణంలో సరుకులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

అరకొరగా సరఫరా

నియోజకవర్గంలోని రేషన్‌కార్డుదారుల్లో 70 శాతం మందికి మాత్రమే రేషన్ సరఫరా చేసి 30 శాతం మందికి కోత విధిం.చారు. ప్రస్తుతం రేషన్‌లో కందిపప్పు కేజీ రూ.68 ఇస్తుండగా బయట మార్కెట్‌లో కేజీ రూ.150 నుంచి రూ.170 వరకు పలుకుతుంది. దీంతో రేషన్‌లో కందిపప్పుకు డిమాండ్ బాగా ఉందని ఎవరు ముందు తీసుకుంటారో వారికే ఇస్తామని, ఆఖరులో వచ్చే వారికి ఇచ్చే పరిస్థితి లేదని డీలర్లు తెలియజేస్తున్నారు. మండల పరిధిలోని సివిల్ సప్లయ్ గోడౌన్ ద్వారా సింగరాయకొండ, టంగుటూరు, పొన్నలూరు, జరుగుమల్లి, కొండపిలోని కొన్ని రేషన్‌షాపులకు రేషన్ సరఫరా జరుగుతుంది. ఈ మండలాలకు నెలవారీగా బియ్యం 900 టన్నులు, చక్కెర 30 టన్నులు రావాల్సి ఉండగా అవి నూరుశాతం వచ్చాయి. జొన్నలు 10 టన్నులు వచ్చాయని, కందిపప్పు మాత్రము 65 టన్నులు రావాల్సి ఉండగా 47 టన్నులు మాత్రమే వచ్చాయని గోడౌన్ ఇన్‌చార్జి రామ్మూర్తి వివరించారు. గత నెల కందిపప్పు కోటా మొదట్లో తక్కువ వచ్చాయని కాని నెలాఖరుకు పూర్తి కోటా వచ్చిందని, కానీ ఈసారి మాత్రం 30 శాతం కోత విధించినట్లు తెలిపారు.

గోడౌన్ సిబ్బంది చేతివాటం:

కందిపప్పు కోటా తక్కువ రావటంతో గోడౌన్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నారు. తమ ఇష్టం వారికి మాత్రం 90 శాతం ఇచ్చారని, కొంతమంది డీలర్లకు వారి ఇచ్చే నజరానాను బట్టి 75 నుంచి 90 శాతం వరకు ఇచ్చారని డీలర్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పూర్తి కోటా ఇచ్చి ఉంటే ప్రతి కార్డుదారునికి కందిపప్పు ఇచ్చేవారమని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, దీనికి తోడు సిబ్బందికి మామాళ్లు ఇచ్చుకోవాల్సి వస్తుందని డీలర్లు వాపోతున్నారు. డిసెంబర్‌లో క్రిస్మస్ పండుగ వస్తుందని, ఈ నెలలో కందిపప్పులో కోత విధించటం ఏందని కార్డుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్ లో కందిపప్పు ధరలు భారీగా ఉండటంతో కొనలేకపోతున్నామని కార్డుదారులు తెలియజేస్తున్నారు. కందిపప్పు కేవలం ఒక నెల సక్రమంగా ఇచ్చి రెండో నెలలోనే కోత విధించడమేందని కార్డుదారులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కందిపప్పు కోటాను నూరుశాతం అందించాలని కార్డుదారులు కోరుతున్నారు.

బడుగుల ఆశాజ్యోతి పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: మహాత్మా జ్యోతిరావ్ పూలే 134వ వర్ధంతిని కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో...

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ అణగారిన, పేద వర్గాల్లో విద్య ఉన్నతికి ఎంతగానో కృషి చేసిన మహోన్నతుడు పూలే అని కీర్తించారు. బడుగు వర్గాలకు సమాన హక్కుల కోసం, అంటరానితనం, వివక్షతలపై అనేక పోరాటాలు చేశారన్నారు. బలహీన వర్గాల అక్షర జ్యోతి వెలిగించిన మహాత్ముడని కీర్తించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను వెలిగించి, పేద వర్గాల్లో విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టారని వివరించారు. నేటి కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలును పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ నేతలపై, సోషల్ మీడియా శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో ప్రజా తిరుగుబాటులో కూటమి సర్కార్ తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏఎంసీ మాజీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, కటికల వెంకట రత్నం, వైస్ ఎంపీపీలు ఎల్ తిరుపతిరెడ్డి, ఆర్ మాణిక్యరావు, బి.కొండారెడ్డి, ఎస్ మోహన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, భవనం కృష్ణారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, జి.ఆదినారాయణరెడ్డి, సిద్ధారెడ్డి, బొర్రారెడ్డి, కౌన్సిలర్లు శ్రీరాం సతీష్, దాసరి మురళీ, చింతం శ్రీను, పి.నాగేశ్వరరావు, నాగార్జునరెడ్డి, చింతగుంట్ల కిషోర్, నాగమణి, షకీలా, సుస్మిత, భాస్కర్‌రెడ్డి, నాని, రవీంద్ర, ఎస్‌కే ఖాశింసా, భాస్కర్, సందాని, టి.ఉమాశంకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ఏడుకొండలురెడ్డి, గోబ్బిళ్ల శ్రీను, వెంకటరావు, శేఖర్, రవి పాల్గొన్నారు.

వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో..

దళిత హక్కుల పోరాట సమితి, అంబేద్కర్ ధర్మ పోరాట సమితి, బీసీ ఐక్యవేదిక, బహుజన టీచర్స్ అసోసియేషన్, ఎమ్మార్పీఎస్ తదితర సంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో పందిటి మోహన్, కోటికర్ల బాదుర్లా, దేపూరి వెంకటేశ్వర్లు, లక్కిపోగు ఆంథోని, చదలవాడ బాలగురవయ్య, పల్లా మాలకొండయ్య, రామినూతల కోటయ్య, బలసాని తిరుపాలు, రాజు, యరజాల బాలనారాయణ, వెంకటయ్య, శేషయ్య, శాంత రాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి బా పూలే అడుగుజాడల్లో నడుద్దాం

పామూరు: మహాత్మా జ్యోతిబా పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు, కో ఆప్షన్ సభ్యులు షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. జ్యోతీబాపూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైస్సార్‌సీపీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలను సంఘటితం చేసిన మహోన్నత వ్యక్తి, సంఘ సంస్కర్త జ్యోతీబాపూలే అన్నారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అంబటి కొండారెడ్డి, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, ఇర్రి వినోద్‌రెడ్డి, షేక్.రసూల్‌ఖాన్, షేక్.కాలేషా, వెంకటేశ్వర్లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహర్ కొనియాడారు. జరుగుమల్లి మండలం వావిలేటిపాడులో గురువారం పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిన్నిక శ్రీనివాసరావు, కొమ్మాలపాటి మదనమోహనరావు తదితరులు పాల్గొన్నారు.



జరుగుమల్లి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు



పామూరు: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రతి పంటను ఆన్‌లైన్ చేయాలి



ఆనందపురం అగ్రహారంలో భూములు పరిశీలిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ బృందం

హనుమంతునిపాడు: జాతీయ వ్యవసాయ విధానంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో భూకమతాల పంటల సాగుబడి వినియోగంపై గురువారం ఆనందపురం అగ్రహారం రెవెన్యూలో కేంద్ర బృందం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు నమోదు చేసిన ఈ క్రాప్ నమోదు సాగు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకుడు జి.శ్రీనివాసరావు రైతులు సాగు చేసిన ఈ పంటలో నమోదు చేసేందుకు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నమోదైన పంటలను పరిశీలించారు. పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. ఇక్కడ సాగు చేస్తున్న పంటల వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం గణాంక శాఖ సహాయ సంచాలకుడు జి.శ్రీనివాసరావు, సీనియర్ గణాంక శాఖ కార్యాలయ అధికారులు టి.రామకృష్ణ నాయక్, రమేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి కేవీ రమణ, డిప్యూటీ గణాంక శాఖ అధికారి సుధాకర్, జీవీ ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి రామ్మోహన్

కనిగిరిరూరల్: రైతులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త ఎస్ రామ్మోహన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో గురువారం వ్యసాయ అధికారుల, విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశం ఏడీఏ ఈ వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సీఎల్‌పీ యాప్‌లో పురుగులు, తెగుళ్లు, పోషకాల లోపాలను గుర్తించి ఎప్పటి కప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఆర్‌ఎస్ దర్శి ప్రధాన శాస్త్రవేత్త పి.సంధ్యారాణి మాట్లాడుతూ కంది, మినుము, పెసర, శనగ మిరప పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ, కనిగిరి ఏడీఏలు జె.వెంకట్రావ్, ఏ వెంకట రమణలు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పనిచేసే వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. రబీ సీజన్‌లో వేసుకోవాల్సిన పంటల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర ఏఓలు శేషమ్మ, శైలజారాణి, పి.జోత్స్నాదేవి, ఆరు మండలాల ఏఓలు, వ్యవసాయ విస్తరణాధికారులు, పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జడ్జి భరత్‌చంద్ర

కనిగిరిరూరల్: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక కొత్తూరులోని ఎస్‌కేఆర్ మానసిక, బధిరుల పాఠశాలలో గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కనిగిరి జడ్జి కె.భరత్‌చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్య నిపుణులు డాక్టర్ తిరుపతిరెడ్డి(కంటి), డాక్టర్ అబ్దుల్ కలాం(ఎముకల) వైద్య సేవలందించారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాల నారాయణ, న్యాయవాది పాశం పిచ్చయ్య, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్, అంజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



సీసీ రోడ్డు పనులను పరీక్షిస్తున్న ఎస్‌ఓ, ఎంపీడీఓ

సీఎస్‌పురం(పామూరు): సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్దేశిత సమయం లోగా రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని డీఎల్‌డీఓ, మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు అన్నారు. సీఎస్‌పురంలో రూ.28.5 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో వేస్తున్న సీసీరోడ్ల పనులను గురువారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, జూనియర్ కళాశాల రోడ్లను, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. క్యూరింగ్ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీరోడ్డుపై నిర్దేశిత సమయం వరకు నీటి నిల్వ ఉండేలా ప్రత్యేక దృష్టి సారించి నీరు పోయాలన్నారు. మండలంలో మిగిలిన సీసీ రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో త్వరితగతిన నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.


అర్హులైన సంఘాలన్నింటికీ రుణాలు ఇప్పించాలి



మాట్లాడుతున్న పీడీ వసుంధర

కనిగిరిరూరల్: అర్హులైన స్వయం సంఘాల గ్రూపులన్నింటికీ నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు ఇప్పించాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర అన్నారు. స్థానిక ఐకేపీ(వెలుగు) కార్యాలయంలో గురువారం ఏరియా కో ఆర్డినేటర్ అంబేద్కర్ అధ్యక్షతన నియోజకవర్గంలోని ఆరు మండలాల గ్రామ సమాఖ్య సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ టి.వసుంధర మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద ఇచ్చిన రుణాల రికవరీని పెంచాలని సూచనలు ఇచ్చారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రగతి చాటిన గ్రూపులకు రుణాలు ఇవ్వాలని, సంఘాల్లో సభ్యులకు వ్యక్తిగత రుణాలు ఇప్పించి వారి జీవనోపాధి మెరుగుదలకు కృషి చేయాలని తెలిపారు. ఎస్‌హెచ్‌జీ సభ్యులు నెలవారీ జమ చేసుకున్న పొదుపును బ్యాంకుల్లో అలాగే ఉంచకుండా అంతర్గత అప్పులు తీసుకునే సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీ డీపీఎం సునీత, ఇన్సూరెన్సు డీపీఎం కృష్ణాకుమారి, డీఎంజీ ఎస్‌కే జిలానీ, శిక్షకురాలు విజయలక్ష్మి, ఏపీఎం అశోక్‌కుమార్, సీసీలు మహబూబ్ బాషా, వజ్రమ్మ, మస్తాన్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

కిరాణా దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడుతో పాటు పలు గ్రామాల్లోని కిరాణా షాపుల్లో పొన్నలూరు పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఇటీవల మండలంలోని ప్రతి గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో బడ్డీ కొట్లు, హోటళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై అనుక్ మాట్లాడుతూ అక్రమ మద్యం బెల్ట్ షాపులు, అమ్మకాలు జరిగితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇద్దరు బెల్టుషాపు నిర్వాహకులు అరెస్టు

కనిగిరిరూరల్: మద్యం బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరిని గురువారం రాత్రి పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. మండలంలోని అడ్డురోడ్డు ఉస్తుం వారిపల్లిలో బెల్టుషాపులో మద్యం విక్రయిస్తున్న ఏ లక్ష్మీ రెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద 7 క్వార్టర్ బాటిళ్లను, అలాగే మండాదివారిపల్లిలో బెల్టుషాపు నడుపుతున్న ఓ మహిళ వద్ద 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.శ్రీరాం తెలిపారు.

క్వారీలో కార్మికుడికి విద్యుత్ షాక్

కనిగిరిరూరల్: పట్టణంలోని ఆంధ్రా గ్రానైట్ క్వారీలో పనిచేసే కార్మికునికి విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక చింతల పాలెం వద్ద ఆంధ్రా క్వారీలో పనిచేసే యూపీకి చెందిన మనీష్ సింగ్ విద్యుత్ సప్లయ్‌కు సంబంధించిన ఫీజ్ లింక్ పనిచేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో కార్మికుడు ఎం సింగ్‌కు మెడకు, కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

మహిళా సాధికారతపై అవగాహన

లింగసముద్రం: మహిళా సాధికారత, బాలల అభివృద్ధిపై మండలంలోని పెదపవనిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.హేమసుజన్ సూచనల మేరకు బేటీ బజావో, బేటీ పడావో, బాల్య వివాహాలు అరికట్టడం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, చైల్డ్ రైట్స్, సైబర్ క్రైమ్స్ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా విద్యార్థుల్లో రక్తహీనత, మెన్స్ట్రుల్ హైజిల్ గురించి తెలియజేశారు. మహిళలకు, పిల్లలకు అందుబాటులో ఉన్న ఫోన్ నంబర్ల గురించి వివరించారు. అపదలో ఉన్నవారు 1098, 181, 112, 1930 నంబర్లకు ఫోన్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ స్నేహలత, ఫ్యాకల్టీ స్టాఫ్ సావిత్రి, దుర్గాభవాని, ప్రవీణ, సఖి వన్‌స్టాప్ సెంటర్ నుంచి ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ టి.కమల, కేస్ వర్కర్ జి.సాధన, సూపర్‌వైజర్ రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

సీఎస్‌పురం(పామూరు): ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని కనిగిరి ఆర్టీసీ డీయం మహ్మద్ సయనాబేగం అన్నారు. స్థానిక బస్టాండ్‌ను గురువారం ఆమె ఆకస్మిక తనిఖీచేశారు. ఈసందర్భంగా డీయం బస్టాండ్ ప్రాంగణానికి హద్దులు వేయించి ఫెన్సింగ్ వేయించారు. ఎవరైనా బస్టాంగ్ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రాధాన్యతా క్రమంలో బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.



సీఎస్‌పురంలో బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం సయనాబేగం

క్లుప్తంగా

301మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి సాయి రుచిత

మర్రిపూడి: మండలంలో కాకర్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 301 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి సాయి రుచిత తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 301 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. ఆమె వెంట హెచ్‌వీ కోటేశ్వరమ్మ, హెచ్‌ఎస్ శ్రీకాంత్, ఇందిరా సుల్తానమ్మ, ఆశాలు ఉన్నారు.

మరోసారి సర్వసభ్య సమావేశం వాయిదా

కొండపి: మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. సర్వసభ్య సమావేశం మొదట బుధవారం నిర్వహించాల్సి ఉండగా కేవలం ఒక సభ్యుడు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక గురువారానికి వాయిదా వేశారు. అయితే గురువారం ఒక్కరూ కూడా రాకపోవడంతో కోరం లేక సర్వసభ్య సమావేశాన్ని మరోసారి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ రామాంజనేయులు తెలిపారు. తదుపరి నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



సచివాలయంలోని రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

కొండపి: సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని పెట్లూరు సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలోని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డుల నిర్వహణపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని రేషలైజేషన్ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని వెంకటాయపాలెంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు జూదరులను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,390 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట, బెల్టు షాపులు నిర్వహిస్తున్నా, మద్యం విక్రయిస్తున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పోస్టాఫీసు ద్వారా మరిన్ని సేవలు



రచ్చబండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సింగరాయకొండ: పోస్టాఫీసు ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందిస్తున్నామని, ప్రజా క్షేమమే మా కర్తవ్యమని కందుకూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ మారుతి మధువాణి అన్నారు. మండలంలోని ఊళ్లపాలెం పాత పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక పోస్టాఫీసు ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతి మధువాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేందుకు ప్రభుత్వం ఎన్‌పీసీఎల్ బ్యాంక్ లింకేజీని తప్పనిసరి చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎన్‌పీసీఎల్ లింకేజీ చేశామని తెలిపారు. పోస్టాఫీసు ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. సబ్ పోస్టుమాస్టర్ రాఘవేంద్ర, పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

హనుమంతునిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ఎస్సై మాధవరావు వాహనదారులకు సూచించారు. మండల పరిధిలోని కంభం కనిగిరి రహదారిలో గురువారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతారన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.